www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 19 నవంబరు 2022 | 5 | పశ్చిమ గోదావరి



26న సహకార ఉద్యోగుల సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - ఏలూరు


పశ్చిమగోదావరి జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ (సిఐటియు) ఉమ్మడి జిల్లా మహాసభ ఈ నెల 26వ శనివారం తాడేపల్లిగూడెంలో జరుగుతుందని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.బాబూరావు, జిల్లా కన్వీనర్ పివి.నరసింహారాజు తెలిపారు. ఈ మహాసభకు ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.అజయ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షులు పి.సత్యనారాయణరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, రాష్ట్ర కోశాధికారి టి.వెంకటరామయ్య ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ మహాసభలో జిల్లాలో సహకార సంఘంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మహాసభకు జిల్లాలోని అన్ని సహకార సొసైటీల నుండి కార్యదర్శులు, ఉద్యోగులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

సృజనాత్మకత వెలికితీతకు యువజనోత్సవాలు దోహదం

ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి దాసి రాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి యువజనోత్సవాలు దోహదపడతాయని ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి దాసి రాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాల కార్యక్రమానికి ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి దాసిరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నిత్యం చదువులతో సతమతమవుతున్న విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల పోటీల్లో పాల్గొనడం ఆటవిడుపుగా ఉంటుందన్నారు. ఇటువంటి పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల ప్రతిభ తెలుస్తుందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా కళలకు పుట్టినిల్లు అన్నారు. జిల్లాలోని పాలకొల్లు, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం ప్రాంతాల్లో జన్మించినవారు పెద్దపెద్ద కళాకారులుగా రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తూ దర్శకులుగా, హీరోలుగా, బుర్రకథలు, సింగర్లు, కవులుగా ఉన్నారని గుర్తు చేశారు. యువజన సర్వీసుల శాఖ సిఇఒ ఎంసిహెచ్ మెహరాజ్ మాట్లాడుతూ జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఏటా జాతీయ యువజన దినోత్సవం జరుగుతుందన్నారు. దాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో నేడు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించుకుంటున్నామన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు రాష్ట్రస్థాయి ఫెస్టివల్ డిసెంబర్ 13, 14, 15 తేదీలలో గుంటూరులో నిర్వహించే పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారు జనవరి 12న జాతీయస్థాయిలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ బ్రహ్మరాజు, కల్చరల్ ఇన్‌ఛార్జి సీతారామరాజు, తహశీల్దార్ రవికుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి దాసి రాజు

సెంట్ మేరీస్ స్కూల్లో చిల్డ్రన్ పార్కు ప్రారంభం

పాలకొల్లు రూరల్: యాళ్లవానిగరువులోని సెంట్ మేరీ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్క్‌ను జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లల ఆరోగ్యానికి, అధిక ఉత్తేజానికి ఇలాంటివి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పిల్లలు రోజంతా ఉత్సాహంగా ఉండాలన్నా, చదువులో చురుగ్గా ఉండాలన్నా ఈ ఆటపాటలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో చందక సత్తిబాబు, యలమంచిలి వైస్ ఎంపిపి గొల్లపల్లి శ్రీనివాసరావు, యలకల రంగా, శంకరావు శ్రీను, బాల చంద్రన్ పాల్గొన్నారు.

మొగల్తూరులో పోలీస్ క్వార్టర్స్ పరిశీలన


మొగల్తూరు: మొగల్తూరులోని పోలీసు క్వార్టర్స్‌ను ఆ శాఖకు చెందిన గృహ నిర్మాణ శాఖ డిఇ విద్యాసాగర్ శుక్రవారం పరిశీలించారు. అన్ని ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్ భవనాలు, నివాస సముదాయాలను కూడా పరిశీలిస్తున్నామని ఆయన తెలిపారు. దీనిలో భాగంగా మొగల్తూరు పోలీస్‌స్టేషన్, క్వాటర్స్‌ను పరిశీలించమన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ ఎం.వీరబాబు సిబ్బంది ఉన్నారు.


సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా..

గోపాలన్, రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - పాలకొల్లు

సిఐటియు జిల్లా అధ్యక్షులుగా జెఎన్‌వి.గోపాలన్, ప్రధాన కార్యదర్శిగా కె.రాజరామ్మోహన్ రాయ్ తిరిగి ఎన్నికయ్యారు. పాలకొల్లులో 2 రోజుల పాటు జరిగిన సిఐటియు జిల్లా మహాసభలో కొత్త కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మరో 17 మందితో జిల్లా ఆఫీస్ బేరర్స్ ఏర్పాటు చేశారు. ఆఫీస్ బేరర్స్ ఉపాధ్యక్షులుగా వాసుదేవరావు, తెలగంశెట్టి సత్యనారాయణ, డి.దక్షణామూర్తి, సూర్నీడు వెంకటేశ్వరరావు, అజయకుమారి, ఝాన్సీ లక్ష్మీ, జ్యోతి, కార్యదర్శిగా కర్రి నాగేశ్వరరావు, పివి.ప్రతాప్, డి.కళ్యాణి, ఎం.త్రిమూర్తులు, ఎ.అరుణ్, ఎం.ఆంజనేయులు, ఎమ్‌డి.హసీనాబేగం, ఎం.సూరిబాబు, కోశాధికారిగా జవ్వాది శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ మహాసభ జయప్రదం కావడానికి సహకరించిన అందరికీ నూతన కార్యవర్గం ధన్యవాదాలు తెలిపారు. జనవరి 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.


జెఎన్‌వి గోపాలన్


రాజారామ్మోహన్‌రాయ్

కెవిపిఎస్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా విజయకుమార్, ప్రధాన కార్యదర్శిగా క్రాంతిబాబు


పలు తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి - భీమవరం

కెవిపిఎస్ పశ్చిమగోదావరి జిల్లా నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా బత్తుల విజయకుమార్, కారుమంచి క్రాంతిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కెవిపిఎస్ జిల్లా 5వ మహాసభ ఈ నెల 16, 17వ తేదీల్లో భీమవరంలో జరిగింది. ఈ మహాసభలో నూతన జిల్లా నాయకత్వాన్ని ప్రతినిధులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నూతన జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా బత్తుల విజయకుమార్, కారుమంచి క్రాంతి బాబు మహాసభ వివరాలను మీడియాకు శుక్రవారం విడుదల చేశారు. జిల్లా మహాసభలో అధ్యక్ష కార్యదర్శులతో పాటు ఉపాధ్యక్షులుగా బి.బలరాం, దిగుపాటి రాజగోపాల్ (మాజీ ఎంఎల్ఎ), సహాయ కార్యదర్శులుగా ఇంజేటి శ్రీనివాస్, చిన్న నాగేశ్వరరావు, మాదాసి గోపి, కప్పల రత్నంరాజుతోపాటు మహిళా ప్రాతినిధ్యం కోసం ఒక కో ఆప్షన్ సహా తొమ్మిది మందితో కార్యదర్శి వర్గం, మొత్తం 27 మందితో నూతన జిల్లా కమిటీని మహాసభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. మూడేళ్లకోసారి కెవిపిఎస్ గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర, అఖిల భారత స్థాయి వరకూ మహాసభలు జరుగుతాయని తెలిపారు. ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి గ్రామ మండల ముఖ్య నాయకత్వం హాజరైనట్లు తెలిపారు. మూడేళ్ల పాటు జిల్లాలో దళితుల సమస్యలు, దళితపేటల అభివృద్ధి, కుల వివక్ష, అంటరానితనం, సామాజిక, ఆర్థిక అసమానతలపై కెవిపిఎస్ చేసిన ఉద్యమాలు, పోరాటాలను ఈ మహాసభలో సమీక్షించుకున్నామన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న దళిత, క్రైస్తవ, మైనార్టీ వ్యతిరేక విధానాలపై రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం దళిత సంక్షేమ పథకాలు నిలిపివేత వంటి విధానాలపై చర్చించామన్నారు. దళితులు, దళిత క్రైస్తవులు, దళితపేటల అభివృద్ధి, సామాజిక న్యాయం వంటి అంశాలపై ప్రతినిధులు మాట్లాడారన్నారు.

బిజెపి దళిత వ్యతిరేక విధానాలపై వైసిపి ఎందుకు పోరాడడం లేదని ప్రశ్నించారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని బిజెపి నిర్వీర్యం చేస్తుంటే రావాల్సిన 15 సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం నిలిపివేస్తోందని విమర్శించారు. సామాజిక న్యాయం అంటే పదవులు కట్టబెట్టడం కాదని ప్రతి దళిత కుటుంబానికీ ఒక ఉద్యోగం, ఇల్లు, భూమి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణం భర్తీ చేయాలని కోరారు. గరగపర్రు దళితుల సమస్య ఇంకా కొనసాగుతూ ఉందని, 102 దళిత కుటుంబాలకు నష్టపరిహారం తక్షణం అందించాలని, ఉద్యమ సమయంలో అప్పటి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను కొట్టివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపైనా భవిష్యత్తులో జిల్లాలో నిర్వహించాల్సిన ఉద్యమ, పోరాటాల ప్రణాళికను ఈ మహాసభల్లో రూపొందించుకున్నామని తెలిపారు.


బత్తుల విజయకుమార్


కారుమంచి క్రాంతిబాబు

మహాసభ తీర్మానాలు ఇవే

1. గరగపర్రు దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. మిగిలిన వారికి నష్ట పరిహారం వెంటనే ఇవ్వాలి.
2. జిల్లాలో ప్రతి దళితపేటకూ జిఒ 1235 ప్రకారం రెండెకరాల భూమిని శ్మశానవాటికకు కేటాయించాలి.
3. పెండింగ్‌లో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.
4. రాష్ట్రంలో దళితులకు చెందిన 27 సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి.
5. దళిత క్రైస్తవులను ఎస్‌సిలుగా గుర్తించి రిజర్వేషన్లు అమలుచేయాలి.
6. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి.
7. దళిత చర్మకార వృత్తిదారులకు, డప్పు కళాకారులకు, గుర్తింపు కార్డులిచ్చి, అన్ని రకాల సంక్షేమ పథకాలను అమలూ చేయాలి.
8. దళితపేటల్లో ఉన్న ప్రయిమరీ స్కూళ్లను దళితపేటల్లోనే ఉంచాలి.

పాఠశాలల్లో చెకుముకి సైన్స్ పోటీలు

ప్రజాశక్తి - పాలకోడేరు

విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని మండల విద్యాశాఖ అధికారి రామలక్ష్మణమూర్తి సూచించారు. పాలకోడేరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఇఒ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు మహేష్, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: చెకుముకి సైన్స్ సంబరాలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీల్లో మండల, పట్టణానికి చెందిన జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నట్లు కన్వీనర్ సిహెచ్‌వి.సత్యనారాయణ తెలిపారు. గత నెలలో పాఠశాల స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన 6, 7, 8, 9 తరగతులకు చెందిన విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నట్లు తెలిపారు. మండల స్థాయిలో కడియద్ద జిల్లా పరిషత్ పాఠశాల ప్రథమ స్థానంలో, కొమ్ముగూడెం, మాధవరం పాఠశాలలు ద్వితీయ స్థానంలో, కొమ్ముగూడెం జిల్లా పరిషత్ పాఠశాల తృతీయ స్థానంలో, పట్టణస్థాయిలో టిఎస్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో, సుబ్బారావు పేట మున్సిపల్ హై స్కూల్ ద్వితీయ స్థానంలో, తాళ్ల ముదునూరుపాడు మున్సిపల్ హై స్కూల్ తృతీయ స్థానంలో నిలిచినట్లు కన్వీనర్ రవికుమార్ తెలిపారు. పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు కన్వీనర్లు సత్యనారాయణ, రవికుమార్ తెలిపారు.

మొగల్తూరు : మండల స్థాయిలో జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు చెకుముకి పోటీలు శుక్రవారం పెనుమత్స రంగరాజు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రథమ స్థానంలో బండి ముత్యాలమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, కాళీపట్నం ప్రయివేట్ పాఠశాల నుంచి సెంట్ మేరీస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారు. ద్వితీయ స్థానంలో శేరేపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, తృతీయ స్థానంలో మొగల్తూరు పెనుమత్స రంగరాజ జెడ్‌పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారు. మొదటి స్థానం సాధించిన వారిని జిల్లాస్థాయిలో నిర్వహించే పరీక్షా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విజేతలకు మొగల్తూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మూర్తిరాజు చేతుల మీదుగా బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. ఈ పరీక్ష నిర్వహణ అబ్జర్వర్‌గా యుటిఎఫ్ కౌన్సిల్ సిహెచ్ కృష్ణమోహన్, మండల కన్వీనర్ ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి కె.బ్రహ్మయ్య పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం రూరల్: స్థానిక ఎస్‌సిహెచ్ బిఆర్‌ఎం హైస్కూల్‌లో మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ సంబరాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక కార్యక్రమాలను అభినందించారు. జనవిజ్ఞాన వేదిక (జెవివి) ఉపాధ్యక్షులు చింతపల్లి ప్రసాదరావు మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం కల్పిస్తూ మూఢనమ్మకాలు, మూఢ విశ్వాసాలను తొలగించి వారిని చైతన్యపర్చేలా కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించి వారిలో సైన్స్ పట్ల అభిరుచిని పెంచుతున్నామన్నారు. కార్యక్రమంలో జెవివి నాయకులు పి.సీతారామరాజు, సిహెచ్.ప్రసాదరావు, బి.శ్రీనివాసరావు, ఎ.జాన్సన్, ఎ.లోకేష్, ఎం.సోమేశ్వరరావు, పి.గోపాలరాజు, డి.రోజారమణి, పి.శ్రీనివాస్, నర్సింహరాజు పాల్గొన్నారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో భీమవరం రూరల్ నుండి ఏడు టీమ్స్, అర్బన్ నుండి 12 టీములు పాల్గొన్నాయి. విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు.


పాలకోడేరు విజేతల వివరాలను వెల్లడిస్తున్న జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుల శ్రీనివాస్


భీమవరం రూరల్ : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సభ్యులు


మొగల్తూరు :విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు మూర్తిరాజు

యుద్ధ ప్రాతిపదికన సిఎం పర్యటన ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - నరసాపురం

ఈ నెల 21వ తేదీ సోమవారం ముఖ్యమంత్రి నరసాపురం పర్యటన నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం 25వ వార్డు నక్కావారి పేట, వీవర్స్‌కాలనీ సభా వేదికను, చినమామిడిపల్లి లేఅవుట్ హెలీప్యాడ్‌ను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. శాఖల వారీగా కేటాయించిన పనులను సకాలంలో పూర్తి చేసి రేపటిలోగా నివేదిక ఇవ్వాలని ఆమె ఆదేశించారు. ముఖ్య మంత్రి పర్యటనలో ఏ పొరపాటూ జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. చినమామిడిపల్లి హెలీప్యాడ్ నుంచి సభా వేదిక వరకూ రహదారులు, పట్టణం అంతా పూర్తి శానిటేషన్, పూల మొక్కలతో సుందరీకరణ చేయాలన్నారు. మూడు రోజులపాటు పనిచేసే విధంగా ప్రత్యేక కంట్రోల్ కమాండ్ రూమ్ ఏర్పాటు చేసి 24 గంటలూ పనిచేసేలా అధికారులు, సిబ్బంది నియమించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆమె వెంట జిల్లా జాయింటు కలెక్టర్ జెవి మురళి, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్ అండ్‌బి ఎస్‌ఇఎస్ లోకేశ్వరరావు, తహశీల్దార్ ఎస్ఎం.ఫాజిల్, అధికారులు పాల్గొన్నారు.

మొగల్తూరు : ఈ నెల 21న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కోరుతూ ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని గ్రామాల్లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మొగల్తూరులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలకు గ్రామ వాలంటీర్లకు సచివాలయ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నర్సాపురం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పర్యటించనున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన రూ.3,500 కోట్ల నిధులతో వశిష్ట వారధి, బియ్యపు తిప్పలోని మినీ హార్బర్ ఆక్వా యూనివర్సిటీ తదితర పనులకు భూమి పూజ, బస్టాండ్ వంద పడకల ఆసుపత్రి, విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవాలు చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, సొసైటీ ఛైర్ పర్సన్ మోటుపల్లి రామ భాస్కరరావు, నాయకులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

సిఎం పర్యటనలో 10 స్పందన కౌంటర్లు

డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఈ నెల 21వ తేదీ సోమవారం నరసాపురం నియోజకవర్గంలో జరిగే సిఎం పర్యటనలో ఫిర్యాదులు స్వీకరించేందుకు 10 స్పందన కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఎంపిడిఒలు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెసిహెచ్ అప్పారావు మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయాల ఆధ్వర్యంలో ఈ స్పందన కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. సిఎం పర్యటించే ప్రాంతాల్లో ఈ కౌంటర్లు ఉంటాయన్నారు. బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ వద్ద, ఆక్వా యూనివర్సిటీ వద్ద, సిఎం సభా ప్రాంగణంలో, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఇలా పదిచోట్ల స్పందన కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కౌంటర్లలో ఒక ఎంపిడిఒ, పదిమంది వాలంటీర్లను అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించడానికి నియమించామన్నారు. సిఎం పర్యటన విజయవంతానికి కృషి చేయాలన్నారు. అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడంలో ఎటువంటి అలసత్వం వహించకుండా చూడాలని నరసాపురం ఎంపిడిఒ శివప్రసాద్ యాదవ్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నుంచి ఎంపిడిఒలు, వాలంటీర్లు పాల్గొన్నారు.


ఎంపిడిఒలు, వాలంటీర్లకు సూచనలిస్తున్న డిఎల్‌డిఒ అప్పారావు


ఫిల్టర్‌బెడ్‌లు బాగు చేయాలని నిరసన

ప్రజాశక్తి - నరసాపురం

లక్ష్మణేశ్వరం కుళాయి చెరువు ఫిల్టర్‌బెడ్‌లకు వెంటనే మరమ్మతులు చేపట్టి శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. లక్ష్మణేశ్వరం రక్షిత తాగునీటి పథకంలోని కులాయి చెరువు ఫిల్టర్ బెడ్లు బాగుచేసి, స్వచ్ఛమైన నీరు అందించాలని కోరుతూ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో దర్భరేవు గ్రామ మత్స్యకారులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా ఉన్న లక్ష్మణేశ్వరం కుళాయి చెరువు ఫిల్టర్‌బెడ్‌ల సమస్యను అధికారులు, నాయకులు పట్టించుకోలేదన్నారు. మైక్రోఫిల్టర్ కూడా పాడైపోయిందని మరమ్మతులు చేయాలని తెలిపారు. తొమ్మిది పంచాయతీల్లో వేల మంది ప్రజలు ఈ నీటినే తాగుతున్నారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వేలాది మంది ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొప్పాడి సత్యనారాయణ, మల్లాడి పెద్దిరాజు, కోప్పడి వెంకటేశ్వర్లు, కొప్పాడి సాంబమూర్తి, తిరుమాని కోటేశ్వరరావు, తిరుమాని నారాయణ మూర్తి, తిరుమాని భూలోకం, తిరుమాని వెంకటేశ్వరరావు, వీర్ల వెంకమ్మ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మత్స్యకారులు


ఉండి : గ్రామస్తులతో మాట్లాడుతున్న పివిఎల్ నరసింహరాజు

అభివృద్ధి పనులకు పివిఎల్ శంకుస్థాపన

ప్రజాశక్తి - కాళ్ల

బొండాడ గ్రామంలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు చేతుల మీదుగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం అభినందనీయమని గ్రామ సర్పంచి మన్నే వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం బొండాడలో సిమెంట్ రోడ్లు, సీసీ డ్రెయినేజీలు తదితర అభివృద్ధి పనులకు డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు శంకుస్థాపనలు చేశారు. బొండాడ గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన మాట ప్రకారం రూ.20 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్లు, సీసీ డ్రెయిన్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి గునుపూడి ప్రసన్నకుమార్, వార్డు సభ్యులు మన్నె నాగరాజు, సర్పంచుల ఛాంబర్ జిల్లా అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు, పెన్మత్స విశ్వనాధరాజు, కోపల్లె సొసైటీ వేగేశ్న జయ రామకృష్ణంరాజు, మాజీ సర్పంచి వీరమల్లు మోహన్ రావు పాల్గొన్నారు.

ఉండి : ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. శుక్రవారం కలిసిపూడి గ్రామంలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఆక్వా చెరువుల వల్ల పంట కాలువలు కలుషితమయ్యాయని, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి 40 వేల కోట్ల రూపాయల వ్యయంతో ధవళేశ్వరం నుంచి నిర్మించబోయే వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందని, త్వరలోనే నిర్మాణ దశలోకి వెళ్తుందని తెలిపారు. గత పాలకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలం వెళ్లదీసేవారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీలు నెరవేర్చడమే కాకుండా, సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయో లేదో తెలుసుకోవడానికి గ్రామాల్లో నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, శాసనసభ్యులను గడపగడపకు వెళ్లాలని ఆదేశించారని అన్నారు. ఉండి నియోజకవర్గంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించి 97 రోజులవుతోందని, నాటి నుంచి నేటి వరకూ పర్యటించిన గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కేశబోయిన జానకి శ్రీనివాస్, ఉప సర్పంచి మంతెన చంటిరాజు, మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, మండల అధ్యక్షులు పెన్మెత్స ఆంజనేయరాజు, రూరల్ బ్యాంక్ ఛైర్మన్ పేరిచర్ల సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ ఎంజి నాయుడు

మెరుగైన వైద్యమే ఫ్యామిలీ ఫిజీషియన్ లక్ష్యం

ప్రజాశక్తి - పెనుమంట్ర

రోగులకు మెరుగైన వైద్యం అందించడమే ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ఉద్దేశమని ఆలమూరు పిహెచ్‌సి డాక్టర్ ఎంజి నాయుడు తెలిపారు. శుక్రవారం ఆలమూరులో ట్రైల్ రన్ కార్యక్రమం సర్పంచి మేడపరెడ్డి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంజి నాయుడు మాట్లాడుతూ హెల్త్ సెంటర్ పరిధిలోని ఓబిలకు చికిత్స అందించడంతోపాటు అనారోగ్యంతో బాధపడుతూ మంచం మీదే ఉన్న వారికి, అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి సరైన చికిత్స అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం కళ్యాణి, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - ఉండి

జనవరి ఒకటో తేదీ 2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహశీల్దార్, అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎం.రవీంద్ర కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. నవంబర్ 20వ తేదీ ఆదివారం ఉండి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు హక్కు నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఓటు కార్డును ఆధార్ కార్డుకు అనుసంధానం చేయడం, ఓటర్ కార్డు తొలగింపు, నివాసం మార్పు వంటి ఓటు కార్డులో సవరణలు తదితర అంశాలపై ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఓటర్లు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. 6, 7, 8, 9, 10 తరగతులకు చెందిన సుమారు 250 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆజాది కా అమృత్ మహోత్సవం, 75 సంవత్సరాల్లో దేశ ప్రగతి, దేశ భక్తి - ప్రాధాన్యత అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గారికిపాటి బాపయ్యశర్మ, ప్రత్తి వీరస్వామి, ఎన్.సాల్మన్ రాజు, నున్నా సత్యం, జనార్ధనారావు పాల్గొన్నారు.

సీసలిలో గ్రామోత్సవం

ప్రజాశక్తి - కాళ్ల

సీసలి గ్రామంలోని అన్నపూర్ణ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి మాలదారులు కలశాలతో గ్రామోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి యాత్రికులు అధిక సంఖ్యలో విచ్చేశారు. కార్యక్రమంలో గణేషన రాంబాబు, ఆలయ ఛైర్మన్ యాళ్లబండి శ్రీనివాస స్వామి, తోట నాని, ఆదిత్య పాల్గొన్నారు.

వన సమారాధనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - భీమవరం

బిసిల కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కోడే యుగంధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని కోడే యుగంధర్ నివాసంలో విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు, యుగంధర్ మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న భీమవరంలో కుమదవల్లి రోడ్‌లోని ఎఎంసి వద్ద బిసిలకు వనభోజనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా సంఘం జాతీయ వ్యవస్థాపకులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో పూజారి రంగారావు, షేక్ అన్సారీ, కందికట్ల ఎడ్వర్డ్, రుద్రాక్షల శ్రీనివాసు, బర్ర వాసు పాల్గొన్నారు.

వైసిపి రైతుల ప్రభుత్వం : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - వీరవాసరం

రైతులను అన్ని విధాలుగా ఆదుకునేది వైసిపి ప్రభుత్వమని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నేలపోగులలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ ఇంటింటికీ వెళ్ళి మూడు సంవత్సరాల కాలంలో వైసిపి ప్రభుత్వం చేసిన సంక్షేమాభివృద్ధిని వివరించారు. అనంతరం గ్రామస్తులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అక్కడికక్కడే అధికారులను ఆదేశిస్తూ పరిష్కరించారు. గ్రామంలో ప్రధాన మార్గాల్లో సీసీ రోడ్లు వేయడం వల్ల హైటెన్షన్ వైర్లు ఎత్తు తక్కువగా ఉందని స్థానికులు తెలపడంతో వెంటనే కరంటు లైను మార్చాలని ట్రాన్స్‌కో ఎఇని ఆదేశించారు. ఇందిరమ్మ కాలనీలో కరంటు, అంతర్గ రోడ్లు వేయాలని కోరడంతో ఎంఎల్ఎ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వేగేశ్న భానువర్మ, గూడూరి ఓంకారం, గొలగాని సత్యనారాయణ, సర్పంచులు చికిలే మంగతాయారు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు నిలిపివేయాలి

ప్రజాశక్తి - ఆకివీడు

ఆక్రమిత, అభ్యంతరాలున్న స్థలాల్లో కట్టడాలను నిలుపుదల చేయాలని తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక సమతానగర్ రోడ్డులోని కాంటూరు ఐదుకు దిగువనున్న స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణం సాగిస్తున్న విషయాన్ని స్థానిక సిపిఎం నాయకులు గత సోమవారం ప్రభుత్వానికి స్పందన కార్యక్రమంలో వివరించారు. ఈ మేరకు వారు పూర్తి వివరాలను అధికారులకు అందించారు. ఈ ఫిర్యాదు మేరకు శుక్రవారం స్థానిక తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలంలో నిర్మాణాలు చేపట్టవద్దని ఆయన చెప్పారు. ప్రారంభించిన నిర్మాణాన్ని వెంటనే ఆపివేయాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు అస్థలం వద్ద వెంటనే బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడుతూ ఆక్రమిత స్థలాలపై గత నాలుగు నెలలుగా తాము పోరాటం చేస్తున్నామని చెప్పారు. చిత్తడి నేలల పరిరక్షణ చట్టం 2007 ప్రకారం కొల్లేరు కాంటూరు ఐదుకు దిగవనున్న నిబంధనను ఎవరు ఉల్లంఘించిన తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో విఆర్ఒ మన్నే శ్రీనివాసు, సిపిఎం నాయకులు వెంకీ అప్పారావు, దోకల రవితేజ, బివి.వర్మ, జి.లావణ్య, గేదెల ధనుష్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మహిళపై అత్యాచారయత్నం

వైసిపి నాయకునిపై కేసు

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని పెదకాపవరం గ్రామంలోని గ్రామస్థాయి వైసిపి నాయకుడు స్థానిక మహిళపై అత్యాచారయత్నం చేయబోయారు. మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెదకాపవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు దత్తడ అబ్రహం అదే గ్రామానికి చెందిన ఓ మహిళను తన ఇంట్లోకి లాక్కెళ్లి అత్యాచారానికి యత్నించారు. ఆ మహిళ అతని నుంచి తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మహిళ ఫిర్యాదు మేరకు అబ్రహంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

అభివృద్ధి దిశగా.. కాళ్ల పంచాయతీ

రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు - కాళ్ల గ్రామ సర్పంచి బంధా విజయ



ప్రజాశక్తి - కాళ్ల

ఒకప్పుడు సమస్యలతో సతమతమవుతున్న గ్రామం నేడు ఎంతో అభివృద్ధి చెందుతోందని కాళ్ల గ్రామ సర్పంచి బంధా విజయ అన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. సర్పంచిగా పనిచేసేందుకు దళిత మహిళకు తొలిసారి అవకాశం లభించిందన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ రిజర్వేషన్ వల్ల 2021 పంచాయతీ ఎన్నికల్లో ఎస్‌సి మహిళకు రిజర్వ్ అయ్యిందని, ఆ ఎన్నికల్లో పోటీ చేసి త్రిముఖ పోటీలో గెలుపొందానని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధే లక్ష్యంగా ప్రతి వార్డులో దశలవారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. సుమారు 8 వేల మంది జనాభా ఉన్న గ్రామ పంచాయతీలో రూ.8.20 లక్షలతో రెండు ఫిల్టర్‌బెడ్‌లకు మరమ్మతులు చేపట్టి, 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.25 లక్షలతో ఆలం ప్లాంట్ నిర్మించామన్నారు. ఆలం ప్లాంట్ నిర్వహణ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టామన్నారు. ప్రజలకు సురక్షిత నీరు అందిస్తున్నామని, స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అభివృద్ధి, పరిశుభ్రత ప్రధానంగా తీసుకుని దశలవారీగా పనులు చేపడుతున్నామని తెలిపారు. దీర్ఘకాలికంగా అభివృద్ధికి నోచుకోని వివిధ ప్రాంతాల్లో జిపిఎస్ రోడ్ల పనులు చేపడుతున్నామన్నారు. పంచాయతీ నిధులు సుమారు రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మురుగు నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాళ్లలో ప్రధాన ఆర్అండ్‌బి రహదారిలో సీసీ డ్రెయినేజీ నిర్మాణానికి రూ.1.50 కోట్లతో 15 ఆర్థిక సంఘం, పంచాయతీ నిధులతో చేపట్టేందుకు అంచనాలు సిద్ధం చేశామన్నారు.



కాళ్లలో నిర్మించిన ఆలం ప్లాంట్

స్వచ్ఛందంగా పంట బోదె ప్రక్షాళన

ప్రజాశక్తి - అత్తిలి

తమ పరిధిలోని పంట బోదెను తామే స్వచ్ఛందంగా ప్రక్షాళన చేసుకుంటున్నామని మంచిలి రైతులు చెబుతున్నారు. శుక్రవారం పాలి మురుగు కాలువకు వెళ్లే రేలంగి ఛానల్ పంట బోదెను తామే ప్రక్షాళన చేసుకుంటున్నట్లు తెలిపారు. సుమారు 70 ఎకరాలు సాగు విస్తీర్ణం కలిగిన ఈ పంట బోదె నత్తా రామేశ్వరం పంపన వారి పాలెం నుంచి మంచిలి రైల్వే గేట్ వరకూ పాలి మురుగు కాల్వ పంట బోదె ద్వారా వ్యవసాయం సాగు చేసుకుంటున్నామని తెలిపారు. వేసవిలో ఎన్ఆర్ఇజిఎస్ పథకం ద్వారా బాగు చేసినా తరువాత పంట బోదె పూడుకుపోవడంతో వచ్చే దాళ్వాకు ముందుగానే స్వచ్ఛందంగా ప్రక్షాళన పనులు చేసుకుంటున్నామని రైతులు ఇంటూరి బాపిరాజు, ద్వారంపూడి వీరెడ్డి, చింత మునలయ్య, కుసుమే గంగరాజు, రాయపాటి నాగరాజు, రాయపాటి సూర్యచంద్రరావు, రాయపాటి అర్జునరావు, కేతా వెంకటకృష్ణ, వెలగల సూర్యచంద్ర రెడ్డి తెలిపారు. మొత్తం 50 మంది రైతులు ప్రక్షాళన పనిలో పాల్గొన్నారు.



స్వచ్ఛందంగా పంట బోదెను బాగు చేసుకున్న రైతులు

అభివృద్ధి బాటలో మృత్యుంజయ సొసైటీ



మాట్లాడుతున్న సొసైటీ కార్యదర్శి పారుపల్లి యేసురత్నం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట మృత్యుంజయ సొసైటీ 1917లో 22 మంది సభ్యులతో ప్రారంభమై అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు అభివృద్ధి బాటలో దూసుకెళ్తోందని సొసైటీ కార్యదర్శి పారుపల్లి యేసురత్నం అన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మృత్యుంజయ కో ఆపరేటివ్ సొసైటీలో సొసైటీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పారుపల్లి ఏసురత్నం మాట్లాడుతూ 1917లో ప్రారంభమైన ఈ సహకార వ్యవస్థ దినదినాభివృద్ధి చెంది అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. శతాధిక సంవత్సరాల సొసైటీ పాలనలో పాలకవర్గాల కృషి మరువలేనిదని, నేడు ప్రభుత్వం సహకార సంఘం అభివృద్ధికి, తద్వారా రైతు సంక్షేమానికి విశేష కృషి చేస్తోందన్నారు. కోట్లాది రూపాయల డిపాజిట్లు, రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ వినియోగించుకుని సహకార వ్యవస్థ పురోభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. సొసైటీ ద్వారా రైతులకు విస్తృత సేవలందిస్తూ సొసైటీ ఆదాయం పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. త్రిసభ్య కమిటీ సంఘం అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, పెరన్స్ పెచ్చేటి సత్యనారాయణ, మేండే శ్రీనివాస్, గొడవర్తి భాస్కరరావు, చేకూరి మాధవరావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మణేశ్వరం మంచినీటి చెరువు శుభ్రం

నరసాపురం ప్రధాన కాలువ నుంచి నేరుగా నీటిని తీసుకునేందుకు ప్రణాళికలు

ప్రజాశక్తి కథనానికి స్పందించిన అధికారులు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

లక్ష్మణేశ్వరం తాగునీటి కుళాయి చెరువు చుట్టూ ఏపుగా పెరిగిపోయిన గడ్డిని తొలగించి గట్టును శుభ్రం చేసేందుకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ పనులను శుక్రవారం మొదలుపెట్టారు. పసర్లెక్కిన మంచినీటి కుళాయి చెరువు శీర్షికన ఈ నెల 18న ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ యు.రవిరాజా ఆదేశాలతో చెరువులో పసర్లెక్కిన నీటిని తొలగించి మంచి నీటిని చెరువులోకి నింపారు. గట్టు చుట్టూ బ్లీచింగ్ చల్లి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా లక్ష్మణేశ్వరం కుళాయి చెరువులోకి నింపే వేములదీవి ఛానల్‌లో నీరు కలుషితమవుతున్న విషయాన్ని డిఇ దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించారు. ఈ సమస్య నివారణకు ఎంఎల్ఎ ప్రసాదరాజు కృషి చేస్తానని చెప్పారు. నరసాపురం ప్రధాన పంట కాలువ నుంచి పైపులైన్ల ద్వారా నేరుగా లక్ష్మణేశ్వరం కుళాయి చెరువులోకి నీరు నింపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు డిఇ రవిరాజా తెలిపారు.



చెరువు గట్టును శుభ్రం చేస్తున్న సిబ్బంది

డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానం

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని మూలపర్రు పంచాయతీ పరిధిలో డ్రెయినేజీల వ్యవస్థ అధ్వానంగా తయారై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీటి పారుదల నిలిచిపోవడంతో దుర్భరమైన వాసన వెదజల్లుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సమస్యలను పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో డ్రెయినేజీలు పూడిక తీయకపోవడంతో మురుగు నీరు ముందుకు కదలక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుచోట్ల పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో దోమల వ్యాప్తి అధికంగా ఉందని, విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా ములపర్రు పంచాయతీ ఎదుట డ్రెయినేజీ

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఆచంట

చలికాలంలో వచ్చే అంటు వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆచంట గ్రామ పంచాయతీ పరిధిలో దోమల నివారణలో భాగంగా 18 వార్డుల్లో ఫాగింగ్ కార్యక్రమాన్ని ఆమె చేపట్టారు గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరుగుతున్నప్పటికీ దోమల బెడద ఎక్కువ ఉండడం గుర్తించి ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. ప్రజలంతా చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పడేయకుండా సమీపంలో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లో వేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జివిఎల్ నరసింహారావు, (నాగబాబు) ఆరోగ్య కార్యకర్త దివ్య పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు దోహదం

ప్రజాశక్తి - ఉండి

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి పోటీలు ఉపయోగపడతాయని గ్రంథాలయ నిర్వాహకులు జెవి.కృష్ణమూర్తి అన్నారు. ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో విద్యార్థులకు శుక్రవారం డ్యాన్స్, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

క్రీడాకారుల జట్ల ఎంపిక

ప్రజాశక్తి - వీరవాసరం

ఉమ్మడి పశ్చిగోదావరి జిల్లా అండర్ -17 కబడ్డీ క్రీడాకారుల జట్ల ఎంపిక పోటీలు వీరవాసరం ఎంఆర్‌కె జిల్ల పరిషత్ హైస్కూల్ వద్ద శుక్రవారం నిర్వహించారు. రెండు జిల్లాల్లోని పదిహేను నియోజకవర్గాల్లోని వివిధ పాఠశాలలకు చెందిన 360 మంది విద్యార్థులు, నూటఇరవై మంది క్రీడా ఉపాధ్యాయులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాలుర నుండి పన్నెండు మందితో ఒక జట్టు, బాలికల నుండి పన్నెండు మందితో మరో జట్టును ఎంపిక చేశారు. ప్రధానోపాధ్యాయిని బి.ప్రభామంజిరి, స్కూల్ గేమ్స్ సెక్రటరీ బి.జాన్సన్, స్కూల్ ఛైర్మన్ మునలయ్య, పిఇటి అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణారెడ్డి, ఎమ్‌డి కుర్దూష్ పాల్గొన్నారు.

నూతన వరి వంగడాలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - ఉండి

నూతన వరి వంగడాల గుణగణాలను రైతులకు క్షేత్ర దినోత్సవం సందర్భంగా తెలియజేసినట్లు మార్టేరు పరిశోధన ఉపసంచాలకులు డాక్టర్ జె.జోగినాయుడు అన్నారు. ఉండి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో భూపతిరాజు హరినాధరాజు వ్యవసాయ క్షేత్రంలో క్షేత్ర దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జె.జోగినాయుడు మాట్లాడుతూ నూతన వరి వంగడాలు అధిక దిగుబడినిస్తూ, చీడపీడలను తట్టుకుంటాయని, రైతులు కొత్త వరి వంగడాలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. నూతన వంగడాలైన ఎంటియు1212, ఎంటియు 1281 రకాలను క్షేత్రస్థాయిలో ప్రదర్శనగా చూపించారు. ఇందులో ఎంటియు 1281 గింజ సన్నగా ఉండి అధిక దిగుబడిని ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.రాజేష్, డాక్టర్ జి.నవీన్‌కుమార్, డాక్టర్ పి.వినయలక్ష్మి, గ్రామ వ్యవసాయ, పశువర్ధక సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



క్షేత్ర దినోత్సవంలో మాట్లాడుతున్న జోగినాయుడు

20న రెడ్డి వనసమారాధన

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 20వ తేదీన పెనుమంట్ర పల్లపు వీధిలో రెడ్డి వన సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు రెడ్డి యూత్ ప్రెసిడెంట్ తేతలి సుధీర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 20వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు రెడ్డి యూత్ ఆధ్వర్యంలో తణుకు, వైజాగ్ వారితో డాన్స్ బేబీ డాన్స్, పిల్లలకు ఆటలు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రథమ బహుమతిగా రిఫ్రిజిరేటర్‌ను తణుకు, పెనుమంట్ర కెవి.రెడ్డి ఫైనాన్స్ కార్పొరేషన్ కర్రి సుధాకర్ రెడ్డి సుజాత దంపతుల కుమారుడు వెంకటరామవినేష్‌రెడ్డి, రెండో బహుమతి గ్రైండర్‌ను హైదరాబాద్ అమీర్‌పేట సత్య టెక్నాలజీస్ కర్రి సుబ్బారెడ్డి తండ్రి వెంకటరెడ్డి, మూడో బహుమతి మిక్సీని పెనుమంట్ర తమనంపూడి వెంకట సత్యనారాయణ రెడ్డి కుమారుడు సాయినాథ్‌రెడ్డి అందించనున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో 16 రకాల రుచికరమైన వంటకాలతో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.